# మూడో మనిషి

జె.వి.బాబు

జయ కారు దిగి ఇంట్లోకి అడుగుపెట్టగానే కనిపించాడు నీరజ్. అతడిని చూడగానే అప్పటివరకూ ఆమె మనసులో కదలాడిన ఆనందం ఎగిరిపోయి, ఆ స్థానంలో ఏదో తెలియని అనీజీనెస్ చోటుచేసుకుంది.

నీరజ్ నవ్వుతూనే పలకరించాడు. "హాయ్ జయా! ఎక్కడ్నుంచి?"

'స్మశానం నుంచి' అనబోయి, ఆగి చెప్పింది. "షాపింగ్ నుండి వస్తున్నా"

"మరేం కొన్నట్టు లేదే?"

"ఏదీ నచ్చలేదు" అనేసి బెడ్రూమ్ వైపు నడిచింది.

డ్రెస్ మార్చుకుంటుండగానే మొబైల్ రింగయ్యింది. నెంబర్ చూసి బటన్ ప్రెస్ చేసిన ఆమె ఉత్సాహంగా "హాయ్ కమల్!..." అంది.

అవతలి వైపు మాటలు విన్నాక, "ఆఁ!ఇంటికి చేరుకున్నాను... వాకిట్లోనే వున్నాడు మహానుభావుడు... నవ్వుతూనే అడిగాడు గానీ... తనకి అనుమానమే... వద్దొద్దు. తనకేం చేయొద్దు... ప్లీజ్... సరేనా?!..." అనేసి ఫోన్ కట్ చేసింది జయ.

ఆమె తన మాటలు భర్త వినలేదు అనుకుంది గానీ, తలుపునకు అవతలి వైపున్న నీరజ్ మరికొద్ది క్షణాలు అలాగే నిలబడి, ఆ తర్వాత నిశ్శబ్దంగా పక్కకు తప్పుకున్నాడు.

* * *

దినపత్రికలన్నీ తిరగేసి పక్కనపెట్టాక సి.ఐ. నాగరాజు, ఎస్.ఐ. నిత్యానంద్‌తో అన్నాడు. "ఛానెల్స్, పేపర్స్ 'భార్య మీదనే అనుమానం' అంటూ రాస్తున్నాయి... సో! ఆమెను అరెస్ట్‌చేసి ఇంటరాగేట్ చేస్తే నిజం బయటకొస్తుంది కదా?"

"ఆమె అత్తమామలు ఆరోపణ చేస్తున్నారు. తన ప్రవర్తన కూడా అనుమానాస్పదంగా వుంది. కాని..." అంటూ ఆగాడు నిత్యానందం.

"కాని...?!" రెట్టించాడు నాగరాజు.

"ఆమె ఈ హత్య చేయలేదేమోననిపిస్తోంది సార్."

సి.ఐ. నాగరాజు కనుబొమలు ముడివడ్డాయి. "ఎందుకని?"

నిత్యానంద్ అదోలా నవ్వాడు. "ఎందుకో తెలియదు సార్!... అలా అనిపిస్తోంది... బహుశా తను షాక్‌లో వుండడం చూసాక, హత్యచేసిన వ్యక్తి అలా వుండదు కదా అన్న అనుమానం కావచ్చు."

"అది నటన కూడా కావచ్చు కదా?"

"చెప్పలేంలే సార్" నిత్యానందం భుజాలెగరేసాడు.

సి.ఐ. నాగరాజు కుర్చీలో వెనక్కువాలి దీర్ఘంగా నిశ్వసించాక "సరే! ఆమె మొబైల్ కాల్స్ రికార్డ్ తెచ్చావా?" అడిగాడు.

"తెచ్చాను సార్" కొన్ని పేపర్స్ సి.ఐ. ముందుంచాడు నిత్యానందం.

అతడు ఆ పేపర్స్ తిరగేసాక ఒక నెంబర్ రౌండప్ చేస్తూ "ఆమె ఈ నెంబర్‌కి ఎక్కువ కాల్స్ చేసింది... ఈ నెంబర్ ఎవరిదో మనకు తెలియాలి" తనలోతాను అనుకుంటున్నట్టుగా నిత్యానందంతో చెప్పాడు.

"పది నిముషాల్లో అడ్రస్ మీ ముందుంచుతాను సార్."

నిత్యానందం వెళ్ళిన నిముషంలోపే డిసిపి నుండి ఫోన్ వచ్చింది. "నాగరాజు నీ ఏరియాలో జరిగిన బ్యాంక్ మేనేజర్ మర్డర్ గురించి ప్రోగ్రెస్ ఏంటి?"

"సార్! అతడి పేరు నీరజ్. ఈ తెల్లవారుఝామున ఎవరో అతడిని తన ఇంట్లోనే గొంతు పిసికి చంపేసారు. ఇంట్లోకి కొత్త వ్యక్తులు ప్రవేశించిన దాఖలాలు లేవు కాబట్టి భార్యనే ఈ హత్యచేసిందనేది అతడి తరుపు బంధువుల వాదన. పైగా ఆమె కేరక్టర్ మంచిది కాదంటున్నారందరూ. కాకపోతే...ఆమె ఒక్కటే ఈ హత్య చేయలేదనేది నిజం. అలాగే తన ఇంట్లో జరిగిన హత్యకు తనే



బాధ్యురాలవుతానని తెలిసి కూడా, ఇలా ఎలా చేయగలిగిందనేది ఇప్పుడొస్తున్న అనుమానం."

"ఆమె ఏమంటోంది". డిసిపి అడిగాడు.

"షాక్‌లో వున్నట్టుగా నటిస్తోందనిపిస్తోంది... శవం తాలూకూ దహన సంస్కారాలయ్యాక, పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్ వచ్చాక ఆమెను అదుపులోకి తీసుకుని ప్రశ్నిద్దామనుకుంటున్నాను."

"ప్రొసీడ్."

మొబైల్ ఆఫ్ చేసిన కొద్దిసేపటికే ఓ అడ్రస్ అతడి ముందుంచి చెప్పాడు. "జయతో ఫోన్ కాంటాక్ట్ మెయిన్‌టైన్ చేస్తున్న ఈ వ్యక్తి పేరు, అడ్రస్ ఇవే సార్."

ఆ పేపర్ చేతిలోకి తీసుకున్న నాగరాజు స్వగతంగా పలికాడు. "కమల్."

* * *

కాస్త బెదిరించేసరికి కమల్ ఒప్పుకున్నాడు. "జయతో నాకు సన్నిహిత సంబంధం వున్నమాట నిజమే. కాని ఈ హత్యతో నాకెలాంటి సంబంధమూ లేదు సార్."

"నీతో రిలేషన్ కంటిన్యూ చేయడానికి భర్త అడ్డుగా వున్నాడని ఆమే అడ్డు తప్పించిందేమో."

అతడు తల అడ్డంగా ఆడించాడు "జయకు అంత ధైర్యంలేదు- తను అంత దుర్మార్గంగా ఆలోచించలేదు సార్."

సి.ఐ. నాగరాజు అదోలా నవ్వాడు. "బోయ్‌ఫ్రెండ్‌ని మెయిన్‌టైన్ చేయడానికి ధైర్యంవున్న ఆడది, మొగుడ్ని అడ్డు తప్పించడానికి భయపడదనుకుంటాను."

"మీరన్యాయంగా మాట్లాడుతున్నారు సార్" కమల్ ముఖం ఎర్రబడింది.

అతడు కూడా సర్‌కాస్టిక్‌గా "అక్రమ సంబంధాలు కలిగిన వాళ్ళ గురించి అంతకన్నా గొప్పగా మాట్లాడలేను" పలికి, 'ఇక వెళ్ళమన్నట్టుగా' సైగ చేసాడు.

కమల్ తలొంచుకుని వెళ్ళిపోయాడు.

అర నిముషం తర్వాత నిత్యానందాన్ని చూస్తూ పలికాడు నాగరాజు. "మనం జయను కలవాలి... వెళ్దాం పదా."

ఇద్దరూ స్టేషన్‌నుండి బయటకు నడిచారు.

పావుగంట తర్వాత ఆ ఇంటి ముందు బైక్ ఆగింది.

బైక్ దిగిన నాగరాజు లోపలికి నడుస్తూ, అనుసరిస్తున్న నిత్యానందంతో చెప్పాడు.

"నేను ఆమెతో మాట్లాడుతున్నప్పుడే, ఆ ఇల్లంతా వెతుకు. అనుమానాస్పద వస్తువులు, హత్యా రహస్యం ఛేదించే ఆధారాలు దొరికితే మెల్లగా నాకు చెప్పు."

వాళ్ళిద్దరూ హాల్లోకి వెళ్ళేసరికి బంధుమిత్రులు చాలామందే వున్నారు.

జయ వాళ్ళను చూసింది. కూర్చున్నచోటు నుండి కదిలే ప్రయత్నం చేయలేదు.

నాగరాజు ఆమె దగ్గరగా వెళ్ళి "మేడమ్! మీతో పర్సనల్‌గా మాట్లాడాలి. మనం ఆ గదిలోకి వెళ్దామా?" అడిగాడు.

ఆమె వారికేసి కొద్ది క్షణాలు తదేకంగా చూసాక, అక్కడినుండి లేచి పక్క గదిలోకి అడుగువేసింది. వారిద్దరూ అనుసరించారు.

అందరూ కూర్చున్నాక నాగరాజు ఆమె ముఖంలోకే చూస్తూ పలికాడు. "జస్ట్! ఇప్పుడే కమల్‌ని కలిసి వస్తున్నాం..."

ఆ క్షణం ఆమె ముఖంలో కదలాడిన భయం వారిద్దరూ గుర్తించారు. శరీరంలో వణుకు మొదలైతే, కంట్రోల్ చేసుకోవడంకోసం ఆమె పెదవులు బిగపట్టింది.

"...అతడు తనకేమీ సంబంధంలేదంటూనే, 'మా ఇద్దరిమధ్య అడ్డు వుండకూడద'ని జయనే భర్తను హత్య చేసి వుండొచ్చు'- అంటున్నాడు. ...అతడి స్టేట్‌మెంట్ ఇప్పుడే రికార్డ్ చేసాం... మరి... మీరా స్టేట్‌మెంట్‌ని ఒప్పుకుంటున్నట్టేనా?!..."

ఆమె కంగారుగా తలూపింది. "లేదు... నేనీ హత్య చేయలేదు. అసలు కమల్ అలా ప్రపోజ్ చేసినప్పుడూ నేను అతడిని అడ్డుకున్నాను. ఇప్పుడు అతడు నామీదే ఇలా చెపుతున్నాడంటే...అనుమానం లేదు, అతడే ఈ హత్యచేసి వుండొచ్చు..."

సి.ఐ. నాగరాజు చాలా కూల్‌గానే అన్నాడు. "కాని మరొకరి సహాయం లేకుండా అతడు ఈ హత్య చేయలేడేమోననిపిస్తోంది."

"అంటే, మీరూ...ఈ హత్యలో నా పాత్ర వుందనుకుంటున్నారా?"

"ఆధారాలన్నీ మీ ఇద్దర్నీ ముద్దాయిలుగా భావించేలా చేస్తున్నాయి... సో! మీ నిజాయితీ నిరూపించుకోవాలంటే అసలేం జరిగిందో క్లియర్‌గా చెప్పాలి."

కొన్ని నిజాలు బయటపెట్టక తప్పని పరిస్థితి అని అర్థంచేసుకున్నాక, ఆమె గాఢంగా నిట్టూర్చింది. "కొద్ది క్షణాలపాటు నిశ్శబ్దం తర్వాత పెదవి విప్పింది."... నీరజ్‌కి సెక్స్‌వుల్ ప్రాబ్లమ్ వుంది. అతడికి తన బలహీనత తెలుసుకాబట్టి, భార్యను సుఖపెట్టలేకపోతున్నానన్న గిల్టీనెస్ వుంది. అందువల్ల నా ఎంజాయ్‌మెంట్‌కి అడ్డు చెప్పేవాడు కాదు. అందుకే కాబోలు అతడు రాత్రుళ్ళు స్లీపింగ్ పిల్ వేసుకుని గాఢ నిద్రలోకి జారుకునేవాడు. ఆ తర్వాత కమల్ మా ఇంటికొచ్చేవాడు. రెండుమూడు గంటలు ఇద్దరం హాయిగా గడిపాక అతడు వెళ్ళిపోయేవాడు... ఎంతైనా కట్టుకున్న భర్త కాబట్టి నీరజ్ తాలూకూ అసమర్థత గురించి అతడికి చెప్పలేదు. కమల్ మాత్రం ఎప్పటికైనా తనకు నీరజ్‌నుండి ప్రమాదం ఎదురుకావచ్చని భయపడేవాడు. అందుకే నీరజ్‌ని అడ్డుతప్పించాలని నాతో అంటే నేనే ఆ ప్రయత్నానికి అడ్డుపడేదాన్ని... ఆ రాత్రి కమల్ వచ్చాడు. రెండు గంటల తర్వాత తలుపు దగ్గిర వేసి వెళ్ళిపోయాడనే అనుకున్నాను. నేను బాత్‌రూమ్‌కెళ్ళి చూసేసరికి తను నాలుక బయటపెట్టి..."ఆ దృశ్యం తలచుకుంటేనే వళ్ళు జలదరించినట్టుంది. ఆ తర్వాత మరేం చెప్పలేకపోయిందామె.

సి.ఐ. నాగరాజు నాలుక చప్పరించాడు. ఏడుస్తున్న ఆమెకేసి భావరహితంగా చూస్తూ "సో! నీ గదిలోంచి వెళ్ళిన కమల్, నీరజ్ గదిలోకి వెళ్ళి తనను హత్యచేసి అలా వెళ్ళిపోయాడంటావ్... అంతేనా?" ప్రశ్నించాడు.

అప్పటివరకూ ఆమెను 'మీరు'అంటూ గౌరవించిన అతడు, అప్పుడే 'నువ్వు'అంటూ గౌరవహీనంగా మాట్లాడడం ఆమె గుర్తించిందో లేదో గానీ, నిత్యానందం గుర్తించాడు.

ఆమె నిలువుగా తలాడించింది.

"మరోసారి నిన్ను ప్రశ్నించే అవసరం రాదనుకుంటాను.... బై" అంటూ సి.ఐ. నాగరాజు బయటకు నడిచాడు.

అతడిని అనుసరించిన నిత్యానందం వీధి వాకిలి దాటాక అన్నాడు. "సార్! నేను ముందే చెప్పాను కదా... ఈవిడ ఆ హత్య చేయలేదు. ఆ కమల్ ఈ హత్య చేసాడని అర్థమైపోతుంది... అతడొక్కడే ఈ హత్య చేయగలడు. ఎందుకంటే హతుడు స్లీపింగ్ పిల్స్ మత్తులో వున్నాడు కాబట్టి."


అప్పటికి బైక్ దగ్గరకు చేరుకున్న నాగరాజు ఆగి, తల అడ్డంగా ఆడిస్తూ నిత్యానందం కేసి చూసాడు. "లేదు...కమల్ ఈ హత్య చేయలేదు. జయ, కమల్ కాకుండా, మూడోమనిషి- అసలు హంతకుడు... ఎస్! ఒకే ఒక వ్యక్తి... ఈ హత్య చేసారు."

"కమల్ ఈ హత్యచేయలేదని ఎందుకనుకుంటున్నారు సార్?"

"ఏ నేరం చేసేవాడైనా తనమీదనే అనుమానం వచ్చే పరిస్థితులున్నప్పుడు వీలైనంత వరకు ఆ నేరానికి దూరంగానే వుంటాడు. తప్పని పరిస్థితైనా తనను అనుమానిస్తారని తెలిసీ నేరం చేస్తాడు. కమల్‌కి నేరం చేయక తప్పని పరిస్థితి లేదు. ఆవేశపడి హత్యచేస్తే అప్పళంగా లభిస్తున్న ఆనందమూ దూరమయ్యే అవకాశముంది. అందువల్ల కమల్ ఈ హత్య చేసి వుండడనే అనుకుంటున్నాను."

సాలోచనగా తలాడించిన నిత్యానందం "మీరన్నది కరెక్టే సార్!... మరా మూడోమనిషి ఎవరై వుంటారు?"

"నీరజ్ హత్య జరిగింది- రాత్రి రెండుగంటల నుండి మూడుగంటల మధ్య అని పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్ చెపుతోంది. ఆ సమయంలోనే కమల్ ఆ ఇంటి నుండి బయటపడ్డాడు. కమల్ ఇంట్లోంచి బయటకు వచ్చి, వెళ్ళాక, జయ ఫ్రెషప్ అయ్యి తలుపువేసేలోపే ఒక వ్యక్తి ఇంట్లో చొరబడి నీరజ్‌ని హత్యచేసి బయటపడ్డాడు... అంటే ఆ వ్యక్తి కమల్‌ని ఫాలో అవడమే కాదు, అతడు ఏ సమయంలో ఇంట్లోంచి బయటకొస్తాడు, ఆ తర్వాత ఎంత సమయానికి వీధి తలుపు లోపల గడియవేయబడుతుందో తెలుసుకుని మరీ ప్లాన్ చేసాడు...సో! కమల్‌ని అంత రాత్రివేళ అంత క్లోజ్‌గా ఫాలోఅయ్యే అవకాశం, అవసరం, ఎవరికుంటాయి?!..." సి.ఐ. సుబ్బారావు తన లోతాను ఏదో గొణుక్కుంటున్నాడు.




అతడు సమస్యను అన్ని కోణాల్లో విశ్లేషించుకుంటున్నాడని అర్థమయ్యాక నిత్యానందం తనను డిస్టర్బ్ చేయదలచుకోలేదు.

అప్పుడే మనసుకేదో తోచినట్టుంది ముఖంలో మెరుపుమెరిసింది. "పద నిత్యానందం"అంటూ బైక్ స్టార్ట్ చేసాడు నాగరాజు.

నిత్యానందం 'ఎక్కడికి సార్'అని అడగలేదు. మౌనంగా బైక్ మీద కూర్చున్నాడు. బైక్ వేగంగా ముందుకు సాగింది.

* * *

కాలింగ్ బెల్ శబ్దం విని తలుపుతీసిన ఆమె పోలీసుల్ని చూడగానే అప్రయత్నంగానే అడుగు వెనక్కువేసింది.

ఆ క్షణం ఆమె ముఖంలో కదలాడిన కలవరపాటు గుర్తించిన సి.ఐ. నాగరాజు మనసులోనే నవ్వుకున్నాడు. "మిసెస్ కమల్?!..." ప్రశ్నార్థకంగా చూసాడు.

"ఎ...ఎస్..."

"మేము మీతో కొంతసేపు మాట్లాడాలి... అలాగే మీ వేలిముద్రలు కూడా కావాలి"

'ఎందుకు?...ఏమిటి?!...' అని ఆమె ప్రశ్నించలేదు. వేగంగా వెనుతిరిగి హాల్లోని సోఫావైపు పరుగెత్తింది. సోఫాలో పడిపోయి వెక్కివెక్కి ఏడవసాగింది.

ఆమె మరేం చెప్పక్కర్లేదు. జరిగిందేంటో వారిద్దరికీ అర్థమైపోయింది. కాకపోతే ఎలా జరిగింది? - ఎందుకు జరిగిందన్నది మాత్రమే కావాలి. ఆ నిజాలు ఆమే చెప్పాలి.

చాలాసేపు ఆమెనలా వదిలేసాక, మనసు భారం కొద్దిగా తగ్గివుంటుందనుకున్నాకే సి.ఐ. నాగరాజు పెదవి విప్పాడు. "మీ వారిని మీరు ఆ రాత్రి ఫాలో అయ్యారు. అతడు ఇంట్లోకి వెళ్ళి బయటకు వచ్చేవరకూ వేచి వున్నారు. ఆ తర్వాత దగ్గరగా వేసివున్న తలుపు తెరుచుకుని ఇంట్లోకి వెళ్ళి నీరజ్‌ని హత్యచేసారు... మీ ఫింగర్ ప్రింట్ పరిశీలిస్తే మీరే హత్యచేసారన్నది రుజువైపోతుంది. మీరసలు నీరజ్‌ని ఎందుకు హత్యచేయాలనుకున్నారు?...నిజానికి మీ కోపం జయ మీదనే కదా!!... ప్లీజ్! మీరు నిజాలు చెప్తే, ఆ సాఫ్ట్ కార్నర్‌తో మేము చేయగలిగిన సహాయం చేయగలుగుతాం."

ఆమె మరోసారి కాసేపు వెక్కివెక్కి ఏడ్చాక, పెదవి విప్పింది. "జయ మావార్ని బుట్టలో వేసుకున్నాక, ఆయన ఒక్కరాత్రి కూడా ఇంట్లో వుండడంలేదు. ఆయన పూర్తిగా ఆ రాక్షసి మత్తులో పడి కొట్టుకుపోతున్నాడు. నాకేం చేయాలో తోచడంలేదు... ఏదో చేయాలని అనిపించసాగింది. ఓరోజు మావార్ని ఫాలో అవుతూ ఆ ఇంటి వాతావరణమంతా గమనించాను. ఆ తర్వాత జయ అత్తామామల్ని కలసి తనెంత నీచంగా ప్రవర్తిస్తుందో వివరించాను. వాళ్ళకు ఆమె కేరక్టర్ గురించి చెప్పడం ద్వారా అప్పటికే నా మనసులో ఓ ప్లాన్ ఫిక్సయ్యింది. ...నిజానికి జయనే చంపేస్తే పీడ విరగడవుతుంది. కాని తను అంత సులభంగా చనిపోవడం నాకిష్టంలేదు. ప్రపంచమంతా తన కేరక్టర్ గురించి నీచంగా మాట్లాడుకుంటుంటే, 'తప్పు' ఎందుకు చేసానా?- అని కుమిలిపోవాలి. ఆ తర్వాత జైల్లో మగ్గుతూ శిక్ష అనుభవించాలి... అంటే నీరజ్‌ని చంపాలని నిర్ణయించుకున్నానన్నమాట. నీరజ్ తప్పుచేయలేదు బట్, తప్పుచేస్తున్న భార్యను కంట్రోల్ చేయలేకపోవడమూ పెద్ద తప్పే... సో! నీరజ్‌ని హత్యచేయడం ద్వారా జయను కేసులో ఇరికించి, ప్రపంచమంతా తన ముఖాన ఉమ్మేలాచేసి, కసి తీర్చుకోవాలన్నది నా కోరిక. ఈ ప్లాన్‌లో మా వారికి ప్రమాదం వుండదనే అనుకున్నాను. ఒకవేళ తను కూడా కేసులో ఇరుక్కున్నా... అది తను చేసిన తప్పుకు శిక్ష అవుతుందనే అనుకున్నా... బట్, ఏ తప్పూ చేయకుండా, కేవలం కసి, ప్రతీకారాలతో రగిలిన నేనే జైలుపాలు కావలసి వస్తుందనుకోలేదు..."

వారిద్దరూ ఆమెకేసి జాలిగా చూసారు. 'భార్యాభర్తలలో ఒకరిది సుఖాలవేట అయినప్పుడు, మరొకరు కష్టాల కడలిలో పడే అవకాశం ఎప్పుడూ వుంది.'

తలుపు దగ్గర చప్పుడయ్యింది. అందరూ తల తిప్పి చూసారు.

కమల్!

సి.ఐ. నాగరాజు అతడి దగ్గరగా నడిచి, తన ముఖంలోకే చూస్తూ పలికాడు. "నీతో ఏడడుగులు నడిచిన మీ ఆవిడ ఇప్పుడు ఏడేళ్ళు జైలులో వుండబోతుంది. అక్కడ జయ భర్త, ఇక్కడ నీ భార్య అడ్డులేరు కాబట్టి మీరిద్దరూ ఇంకా ఆనందంగా గడపొచ్చనుకుంటాను... ఎంజాయ్ మిస్టర్ కమల్."

కమల్ మోకాళ్ళ మీద కూలబడి, రెండు చేతుల్లో ముఖం దాచుకుని భోరున ఏడవసాగాడు. ★